క్లుప్తంగా

రహదారుల మరమ్మతులు చేపడతాం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులు చేపడతామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో అభివృద్ధి పనులతో పాటు, 3 కి.మీ వరకు రోడ్డు మరమ్మతు పనులను అధికారులు అంచనా వ్యయాన్ని రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గతంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించనున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే రహదారుల మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు లైశెట్టి విజయ్, లైశెట్టి గంగన్న, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, బోగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న బాపురెడ్డి, నాయకులు

కథలాపూర్: మండలంలోని పోతారంలో ఎరువుల గోదాం నిర్మాణానికి స్థలాన్ని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం పరిశీలించారు. ప్రతీ సీజన్‌కు రైతులకు సరిపడేలా ఎరువులు నిల్వ ఉంచుకుంటే ఇబ్బంది ఉండదని ఆయన పేర్కొన్నారు. భూషణరావుపేట సొసైటీ నిధుల నుంచి గోదాం నిర్మిస్తామన్నారు. స్థానిక నాయకులతోపాటు రైతులతో చర్చించి స్థలాన్ని ఎంపిక చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, డైరెక్టర్ గుండారపు గంగాధర్, మాజీ సర్పంచ్ ధర్మపురి జలందర్, బద్దం మహేందర్, కల్లెడ శంకర్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్ గుట్ట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 18 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 20న స్వామివారి కల్యాణం, 24న జాతర ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మరింగంటి శ్రీవాత్సవ, పాల్గొన్నారు.

డీపీవో, డీఎల్పీవోలపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్/ ఇబ్రహీంపట్నం: అక్రమాలకు పాల్పడుతున్న డీపీవో, డీఎల్పీవోలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల అధ్యక్షులు పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, గూడ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయా మండల కేంద్రాల్లో మాట్లాడారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారుల నియామకాలతో పాటు పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు సంబంధించి ఓ జూనియర్ అసిస్టెంట్ సహకారంతో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. సమావేశంలో ఎంపీటీసీలు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మరిపెల్లి సత్తెమ్మ, తిమ్మని రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'సాటా' అండ

జగిత్యాల: జగిత్యాల పట్టణానికి చెందిన రఫియొద్దీన్ కమాల్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబానికి సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) అనే ప్రవాసి సంఘం అండగా నిలిచింది. కమాల్ కూతురుకు సాటా మహిళా సభ్యులు తమవంతుగా రూ.1.5 లక్షల ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి జిల్లా అదనపు కలెక్టర్ లత చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సాటా ప్రతినిధులు మల్లేశం, ముజ్జమ్మిల్, రంజిత్, రఫీక్, పీటర్ పాల్గొన్నారు.

తీరనున్న వినియోగదారుల సమస్యలు

- గ్రామసంతల కోసం షెడ్ల ఏర్పాటుకు చర్యలు
- నాలుగు గ్రామాల్లో నిర్మాణానికి సన్నాహాలు
- ట్రాఫిక్ కష్టాలు దూరం..



షెడ్లు నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



కథలాపూర్‌లో రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కథలాపూర్: గ్రామాల్లో ప్రతి రోజూ కూరగాయలు విక్రయించడం, వారానికోసారి నిర్వహించే వార సంతల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు, రైతులు ఇబ్బందులుపడుతున్నారు. రోడ్డు పక్కన ఇరుకు ప్రదేశాల్లో విక్రయాలు జరుగుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక నుంచి ఈ సమస్యలు తీరనున్నాయి. గ్రామసంతల్లో సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు చేసింది. దీంతో సంతల్లో సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మండలంలో నాలుగు గ్రామాలు ఎంపిక

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. కూరగాయాలు, ఇతర వ్యాపారాలు ప్రజలకు అందుబాటులో ఒకేచోట ఉండాలని ఆయా గ్రామాల్లో సంతలు నిర్వహిస్తున్నారు. ఈ సంతల నిర్వాహణలో వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు కలగొద్దని కాంప్లెక్స్ షెడ్ల నిర్మాణాలు, స్టోర్ రూం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా మండలంలోని గంభీర్‌పూర్, తాండ్ర్యాల, కథలాపూర్, చింతకుంట గ్రామాల్లో షెడ్లు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో వీటిని నిర్మించేందుకు అధికారులు స్థలాలను సైతం పరిశీలించారు. పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేశారు.

కేటగిరీల వారీగా సంతల నిర్మాణాలు..

కేటగిరీ–1 కింద నిర్మించే సంతలకు 30 దుకాణాల షెడ్లకు గాను రూ. 15 లక్షలు. కేటగిరీ–2లో నిర్మించే 20 షెడ్ల దుకాణాలకు రూ. 12.50 లక్షలు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను బట్టి కేటగిరీల వారీగా నిధులు మంజూరు కానున్నాయి. మండలంలో గంభీర్‌పూర్, కథలాపూర్ గ్రామాల్లో 30 దుకాణాల షెడ్లు, తాండ్ర్యాల, చింతకుంట గ్రామాల్లో 20 దుకాణాల షెడ్లు నిర్మించాలని అధికారులు అంచనాలు వేశారు. వీటి కోసం స్థలాలు ఎంపిక పూర్తి కావడంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. సంతల్లో సౌకర్యాలు అందుబాటులోకి రానుండటంతో మండలంలోని రైతులు, వ్యాపారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాధలు తీరుతాయి



అష్టకష్టాలు పడి కూరగాయలు సాగు చేస్తే విక్రయించడానికి రైతులకు ఇబ్బందిగా ఉంది. గ్రామాల్లో సంతలు ఉంటే రైతులందరం ఒకే చోట కూరగాయలు విక్రయించే వీలుంటుంది. గిట్టుబాటు ధర వస్తుంది. ప్రతీరోజు వేకువజామున పట్టణ ప్రాంతాలకు కూరగాయలు తరలించే బాధలు తీరుతాయి. సంతల్లో నిర్మించే దుకాణాలను త్వరగా పూర్తిచేయాలి.

– అల్లూరి జనార్ధన్‌రెడ్డి, రైతు, తాండ్ర్యాల

అన్ని గ్రామాల్లో నిర్మించాలి



కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. దీనికి తగ్గట్టుగా సంతల్లో సౌకర్యాలు కల్పించాలి. అన్ని గ్రామాల్లో సంతల కోసం కాంప్లెక్స్ షెడ్లు నిర్మించాలి. అప్పుడే ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి కూరగాయలు, ఇతర వస్తువులు తీసుకెళ్లి విక్రయించడానికి ముందుకు వస్తారు. రైతులకు లాభం చేకూరుతుంది.

– ముస్కు శ్రీనివాస్, రైతు, భూషణరావుపేట

స్థలాలు పరిశీలించాం



మండలంలోని గంభీర్‌పూర్, కథలాపూర్, తాండ్ర్యాల, చింతకుంట గ్రామాల్లో సంతల కోసం షెడ్ల నిర్మాణానికి రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించాం. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. ఆ స్థలాల్లోనే ఉపాధిహామీ నిధులతో నిర్మించాలని నిర్ణయించాం. సంతల్లో కాంప్లెక్స్ షెడ్లు నిర్మించి అందరికీ సౌకర్యాలు కల్పిస్తాం.

– జనార్ధన్, ఎంపీడీవో, కథలాపూర్

సమస్యల పరిష్కారానికే గుడ్ మార్నింగ్ కోరుట్ల



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కోరుట్ల: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికే 'గుడ్‌మార్నింగ్ కోరుట్ల' నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డు మాదాపూర్ కాలనీలో శనివారం ఉదయం అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలు, విద్యుత్, రోడ్లు, నీటి సరఫరా తదితర సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తేగా దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, ఇంజినీరింగ్, విద్యుత్ అధికారులు, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు తన దృష్టికి తేవాలి

కోరుట్ల: నియోజకవర్గంలోని పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల మండల విద్యాధికారులు, హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మన ఊరు –మన బడి ప్రగతి నివేదికను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, తదితర సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2024 డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శనివారం ఆవిష్కరించారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏబీవీపీ నాయకులు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఉర్దూ పాఠశాల, షాదీఖానా, ఖబ్రస్తాన్ పనులను పూర్తి చేసి, ఈద్గా, మసీదుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు ఖుత్బొద్దీన్, ముస్లింలు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ధర్మపురి అసెంబ్లీ కో–కన్వీనర్ బండారి లక్ష్మణ్ అన్నారు.. గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కమలాపూర్‌లో శనివారం బీజేపీ మండలఅధ్యక్షుడు సంగెపు గంగారాం ఆధ్వర్యంలో ప్రవాసీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేశంలో నరేంద్రమోదీని ప్రధాని చేయాలని కోరుతూ యువకులను, రైతులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఇంటింటికి వివరించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి చంద్రశేఖర్, కుమ్మరి తిరుపతి, నార్ల విజయ్, గాజుల రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడకు చెందిన సుంకె నారాయణను కులం పేరుతో దూషించిన ఎక్కలదేవి మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. నారాయణ మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన తొర్తి శ్రీనివాస్ ఇద్దరు జగిత్యాల ఉప్పరిపేటకు చెందిన ఎక్కలదేవి నారాయణ వద్ద గతంలో 13 గుంటల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమికి వెళ్లేందుకు 18 ఫీట్ల రహదారిని కూడా విక్రయించి స్టాంప్ పేపర్ రాసియ్యడంతో రహదారిని ఏర్పాటు చేశారు. ఆ రహదారిని ఎక్కలదేవి మల్లేశం తొలగించగా, శుక్రవారం ఉదయం సుంకె నారాయణ అక్కడకు వెళ్లగా మల్లేశంను రహదారిని ఎందుకు తొలగించావని అడిగాడు. నీకు రహదారి ఎక్కడిదంటూ కులం పేరుతో దూషించాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కథలాపూర్: అధికారులు గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీడీవో జనార్దన్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, కారోబార్లు, పంపు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి గ్రామాల్లోని ట్యాంకుల వరకు నీటి సరఫరాను సంబంధిత అధికారులు చూసుకుంటారన్నారు. ట్యాంకుల్లో ఏ మేరకు నీళ్లు చేరాయి? సరిపోకపోతే గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా బోరు బావుల నుంచి ట్యాంకులను నింపాలన్నారు. సమావేశంలో ఏఈలు చంద్రశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

జగిత్యాల: అర్హులకు డబుల్‌బెడ్‌రూంలు కేటాయించాలని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2008లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొంత మందికి స్థలాలు కేటాయిస్తూ ప్రొసీడింగ్‌లు ఇచ్చారని, వారు ఇళ్లు నిర్మించుకోలేదని, దీంతో డబుల్‌బెడ్‌రూంలు కేటాయించారని, కానీ ఇప్పటి వరకు అవి సైతం పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. పూర్తయిన వాటిని కేటాయించేలా చూడాలని కోరారు.

విధుల్లో చేరిన కమిషనర్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు గత కొన్ని రోజులుగా సెలవుపై వెళ్లగా శనివారం విధుల్లో చేరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్: మండలంలోని వీరాపూర్, ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ శనివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీరు

సాక్షి స్పందన



పొలానికి చేరిన ఎస్సారెస్పీ నీరు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం శివారు నుంచి కోరుట్ల శివారు వరకు రెండు కిలో మీటర్ల వరకు ఉన్న డీ–38 కాలువ ద్వారా ఎస్సారెస్పీ నీరు శనివారం చివరి ఆయకట్టు వరకు చేరింది. దీంతో రైతులు నీళ్లను తమ పొలాలకు మళ్లించుకున్నారు. 'చివరి ఆయకట్టుకు అందని ఎస్సారెస్పీ నీరు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్ డీ–38 కాలువను పరిశీలించి చివరి వరకు నీరు చేరేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. డీ–38 కాలువ దెబ్బతిన్న ప్రాంతాలను ఏఈ పరిశీలించి మరమ్మతులకు కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగెం మాజీ సర్పంచ్ చెప్పాల నర్సయ్య, భూమయ్య, రైతులు పాల్గొన్నారు.

7 నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టాలని ఎంపీడీవో ప్రభు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని సూచించారు. ఉపాధి హామీ పనులు , నర్సరీల్లో పనులు వేగవంతం చేయాలని అన్నారు. గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఏపీవో వినోద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, భగీరథ ఏఈ మల్లేశం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో జనవిజ్ఞాన వేదిక కో–ఆర్డినేటర్లు

జగిత్యాలటౌన్: చెకుముకి సైన్స్ టెస్టులో జగిత్యాల విద్యార్థులు అగ్రభాగాన నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టుకు జిల్లాలోని 13 మండలాల విద్యార్థులు హాజరయ్యారు.తెలుగు మీడియం విభాగంలో తారకరామనగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 9,10,11 తేదీల్లో జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో పాల్గొంటారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలు

మల్లాపూర్: చిన్న చిన్న ప్రయోగాలే శాస్త్రీయ జిజ్ఞాసకు దోహదం చేస్తాయని, విద్యార్థుల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు గొప్ప ఆవిష్కరణలకు నాంది పలుకుతాయని జనవిజ్ఞాన వేదిక తులసి ఆగమయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన చెక్‌ముకి జిల్లాస్థాయి ప్రతిభ పరీక్షలో మల్లాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల కో–ఆర్డినేటర్లు బందరకంటి శ్రీనివాస్, నల్ల పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: చెకుముకి పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం జగిత్యాల నలంద డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి 8, 9,10వ తరగతులకు నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షల్లో మోడల్‌స్కూల్‌కు చెందిన గడ్డమీది వైష్ణవి, పత్తిరెడ్డి హరిణి, గుడురి నచికెత్ తృతీయ స్థానం పొందినట్లు జిల్లా కన్వీనర్ ఆగమయ్య తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ దాసరి నవీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ గంగారెడ్డి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని చైతన్య సీబీఎస్‌ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు సుమిత్, మణికంఠ, హర్షవర్ధన్, సంజయ్‌కుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జనవరి 29న జిల్లాలోని కుమ్మరిపల్లి మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 10, 11 తేదీల్లో హన్మకొండలోని ధర్మసాగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, పీఈటీ ప్రసాద్ అభినందించారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు భూపతిపూర్ విద్యార్థి

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన కట్ట వికాస్ రాష్ట్రస్థాయిలో జరిగే ప్రతిభ పోటీలకు ఎంపికైనట్లు సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన ప్రతిభ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రతిభ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

పిల్లలు చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎస్సై గౌతం పవార్

సారంగాపూర్: చెడు వ్యసనాలవైపు మొగ్గు చూపకుండా తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని ఎస్సై గౌతంపవార్ అన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేను సైతం అనే కార్యక్రమం ద్వారా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు గ్రామంలోకి వస్తే వీటిని అరికట్టడానికి పోలీస్, ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. మూఢ నమ్మకాలు, గల్ఫ్ మోసాలు, సైబర్ మోసాలు వంటి పలు అంశాలపై కళాబృందం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సాయుధ పోరాటంలో సీపీఐది కీలకపాత్ర

జగిత్యాలటౌన్: తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని పార్టీ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్మికులు, రైతుకూలీలు, చిన్న, సన్నకారు రైతులు, అసంఘటిత రంగ కార్మికులు సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం రగిలించిన పార్టీ అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కోరుకంటి శ్రీనివాస్, శ్రీగాద దేవదాస్, వెన్న మహేష్, పాలోజు గణేష్, అక్కపెల్లి గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలను ఆదుకోవాలి

మల్లాపూర్: ఎస్సీ ఉపకులాలను రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి అన్నివిధాలుగా ఆదుకోవాలని మాస్టీన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుద్దుల గంగనర్సయ్య అన్నారు. శనివారం కోరుట్ల పర్యటనకు విచ్చేసిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఉపకులాలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపకులాల్లో ఐక్యత లేకపోవడంతోనే ఏళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఉపకులాల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాస్టీన్ కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

లంబాడిపల్లి, మద్దుట్లలో పశువైద్య శిబిరాలు

మల్యాల: పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య కళాశాల జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని లంబాడిపల్లి, మద్దుట్ల గ్రామాల్లో శనివారం డాక్టర్లు పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 147 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన 250 చికిత్సలు, రెండు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. కళాశాల నుంచి రైతులకు అందిస్తున్న పలు సేవలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ తక్కళ్లపల్లి మాధవరావు, మండల పశువైద్యాధికారి రాజ్‌కుమార్, శ్రీకాంత్, క్యాంపు కోర్డినేటర్లు డాక్టర్ పర్శరాం, డాక్టర్ అంబిక, డాక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు ఎండు తెగులు

ఇబ్రహీంపట్నం : మొక్కజొన్న పంటకు ఎండు తెగులు వస్తుందని రైతులు గమనించి వెంటనే దీని నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దీపిక రైతులకు సూచించారు. మండలంలో ఎండు తెగులు సోకిన మొక్కజొన్న పంటను శనివారం పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో మొక్కజొన్న పంటకు ఎండు తెగులు సోకడం వలన పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని దీని నివారణకు రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జిల్లాలో కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ముక్రం, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఉస్మాన్ కోరారు. పట్టణంలో శనివారం లేబర్ ఆఫీసర్‌ను కలిసి సమ్మె నోటీసును అందజేశారు.

సీసీరోడ్డుకు నిధులు మంజూరు

రాయికల్: మండలంలోని అయోధ్య రామాలయంలో కెనాల్ బ్రిడ్జి నుంచి రామాలయం వరకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో రూ.10 లక్షలతో సీసీరోడ్డు మంజూరైనట్లు గ్రామ నాయకులు ఎద్మల జగదీశ్వర్ రెడ్డి శనివారం తెలిపారు.

కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా లింబాద్రి

కోరుట్ల రూరల్: మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా ముక్కెర లింబాద్రి నియమితులయ్యాడు. ఈ మేరకు నియామక పత్రాన్ని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ ఆధ్వర్యంలో శనివారం కోరుట్లలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు లింబాద్రికి అందజేశారు.

కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దామెర రాజ శేఖర్‌రెడ్డి

మల్లాపూర్: కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దామెర రాజశేఖర్‌రెడ్డి(సిరిపూర్)ని నియమించినట్లు కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యం రెడ్డి తెలిపారు. మండలంలోని ముత్యంపేటలో శనివారం నియామక పత్రాన్ని అందజేశారు.